
సీహెచ్‌సీలో చికిత్సకోసం వేచివున్న రోగులు

అలా చేరి.. ఇలా గైర్హాజరవుతున్న డాక్టర్లు

నెలలుగా హాజరుకాని వైనం

ఆస్పత్రిలో అందని వైద్యసేవలు

రోగులకు తప్పని తిప్పలు

వస్తారు.. మాయమౌతారు..!

గోరంట్ల సీహెచ్‌సీకి వైద్యులు రాం.. రాం..

గోరంట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాని(సీహెచ్‌సీ)కి వైద్యులు రాం.. రాం.. అంటున్నారు. వచ్చి విధుల్లో చేరిన రోజుల వ్యవధిలోనే కనిపించకుండా పోతారు. సెలవు పెట్టరు.. రాజీనామా చేయరు. మొత్తం 8 మంది వైద్యులకుగాను ముగ్గురే పనిచేస్తున్నారు. పని ఒత్తిడితో వారు కూడా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సీహెచ్‌సీలో వైద్యసేవలు మృగ్యమవుతున్నాయి. చేసేదిలేక జబ్బుల బారిన పడినవారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. పట్టణాలకు వెళ్తున్నారు. వెరసి ప్రయాణ, వైద్యం ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. సీహెచ్‌సీ 24 గంటలు పనిచేయాల్సి ఉంది. రోజూ అవుట్ పేషెంట్లు 300 నుంచి 450 మంది వరకు వస్తుంటారు. మొత్తం 8 మంది వైద్యులు పని చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఒక దంత వైద్యుడు, ఇద్దరు ఫిజీషియన్లు మాత్రమే పనిచేస్తున్నారు. ఐదుగురు లేరు. వైద్యుల కొరతతో అత్యవసర కేసులకు ప్రథమ చికిత్సలు అందించి, మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలిస్తున్నారు.

కనిపించకుండాపోతున్న డాక్టర్లు



సీహెచ్‌సీ వైద్యాధికారిగా పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ శివకుమార్ ఉద్యోగోన్నతిపై హిందూపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హిందూపురం ఆసుపత్రి ఎస్ఎన్‌సీలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్యురాలు డాక్టర్ కీర్తిని గోరంట్ల సీహెచ్‌సీ రెగ్యులర్ వైద్యురాలిగా నియమించారు. ఈ ఏడాది మార్చి 15న ఆమె బాధ్యతలు స్వీకరించారు. రెండురోజులు గడిచాయో లేదో.. ఆమె కనిపించకుండా పోయారు. దీంతో డ్రాయింగ్ అథారిటీ ఎవరు స్వీకరించాలన్న దానిపై వైద్యులు తర్జనభర్జన పడ్డారు. చివరికి అయిష్టంగానే గైనకాలజీ వైద్యురాలు పావని బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది. ఆమె కూడా ఆ బాధ్యతలు నిర్వహించలేక సెలవు పేరుతో ఈ ఏడాది జూలై 26 నుంచి కనిపించకుండా పోయారు. అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న జనరల్ మెడిసిన్ డాక్టర్ హరీష్ సైతం ఈ ఏడాది మే 1 నుంచి విధులకు హాజరుకాలేదు. అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అనస్థీషియా వైద్యుడు దానేష్ ఈ ఏడాది ఏప్రిల్ 4న విధుల్లో చేరారు. రెండ్రోజులు తిరక్కుండానే 6వ తేదీ నుంచి అదృశ్యమయ్యారు. జనరల్ సర్జన్ లేకపోవడంతో ఫిజీషియన్ వినోద్‌కుమార్ వైద్యాధికారిగా వ్యవహరిస్తున్నారు. డాక్టర్ ఉష, దంత వైద్యుడు వేణుగోపాల్ ప్రస్తుతం ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారు.

రెండుచోట్లా ఎలా?

డాక్టర్ కీర్తి గోరంట్ల సీహెచ్‌సీలో రెగ్యులర్ వైద్యురాలిగా బాధ్యతలు తీసుకోకపోయి ఉండుంటే మరో డాక్టర్‌ను నియమించి ఉండేవారు. ఆమె అలా వచ్చి.. ఇలా వెళ్లిపోయారు. ఆమె ఇక్కడే గత నెల వరకు పనిచేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. ఆమె హిందూపురంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగానే కొనసాగుతున్నారు. ఒకే వ్యక్తి రెండు ఉద్యోగాల్లో కొనసాగడానికి వీలులేదు. అయినా ఈవిషయాన్ని చాలాకాలం గుర్తించలేదు. చివరికి విషయం బయటకు పొక్కడంతో రహస్యంగా గోరంట్ల ఆసుపత్రినుంచి బయోమెట్రిక్ అటెండెన్స్‌ను హిందూపురానికి బదిలీ చేయించుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఆక్టోబరు 21న రాజీనామా సమర్పించారు. పట్టణ ప్రాంతాల్లో సొంత క్లీనిక్‌లు ఏర్పాటు చేసుకున్న పలువురు వైద్యులు మండల కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో పనిచేయడం ఇష్టం లేక గైర్హాజరవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

గోరంట్ల సీహెచ్‌సీలో ఐదు స్పెషలిస్టు వైద్య పోస్టులు, హెడ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఓపీ అధికంగా ఉండడంతో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతున్నాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం హిందూపురం నుంచి ఇద్దరు చిన్నపిల్లల వైద్యులు, కదిరి నుంచి గైనకాలజీ డాక్టర్ వారంలో మూడురోజులపాటు గోరంట్లలో విధులు నిర్వహిస్తున్నారు.

- వినోద్‌కుమార్, గోరంట్ల సీహెచ్‌సీ వైద్యాధికారి

నోటీసులు జారీ చేశాం

చిన్నపిల్లల వైద్యురాలు కీర్తి రెండుచోట్లా పనిచేయడం పట్ల నోటీసులు జారీ చేశాం. ఆమె రాజీనామా చేశారు. మరో వైద్యురాలు పావనికి కూడా నోటీసులిచ్చాం. గోరంట్ల సీహెచ్‌సీలో వైద్యుల కొరత ఉన్న విషయం వాస్తవమే. ఇతర ఆస్పత్రుల నుంచి వైద్యులను పంపుతున్నాం.

- తిప్పేంద్రనాయక్, డీసీహెచ్ఎస్


గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి


కదిరిలో శివపార్వతుల ఉత్సవమూర్తులు


ధర్మవరం పట్టణంలో త్రిలింగేశ్వరుడికి అలంకరణ


లేపాక్షి ఆలయంలో కార్తీక దీపం వెలిగిస్తున్న చిన్నారి

సర్వం.. దీపశోభితం..

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

పుణ్యస్నానాలు ఆచరించి.. కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు


హిందూపురంలో దీపాలు వెలిగిస్తున్న యువతులు


శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన ఖాద్రీశుడు

పుట్టపర్తి, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా అంతటా కార్తీక దీపాలను వెలిగించారు. పరమేశ్వరుడిని భక్తితో పూజించారు. శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సాయంత్రం మహిళలు పెద్దఎత్తున శివాలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో శివలింగాలకు జల, క్షీరాభిషేకాలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. శిల్పకళాక్షేత్రం లేపాక్షి, హిందూపురంలో బసవనపల్లి శివాలయం, పెనుకొండలో ఐముక్తేశ్వరాయలం, శ్రీకైలాసం, కదిరి లక్ష్మీనరసింహ స్వామి, ధర్మవరం, మడకశిర, పుట్టపర్తి తోపాటు జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాల్లో కార్తీక దీపోత్సవం వైభవంగా సాగింది. పలు ఆలయాల్లో జ్వాలాతోరణం చేశారు. పెనుకొండలోని ఐముక్తేశ్వరాలయంలో లక్ష దీపారాధన కన్నులపండువగా సాగింది. భక్తులు పోటెత్తారు.


ఖాద్రీశుడి ఆలయంలో జ్వాలాతోరణం


ధర్మవరంలోని త్రిలింగేశ్వరుడి ఆలయంలో జ్వాలాతోరణం


పెనుకొండ ఐముక్తేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నేలకొరిగిన వరిపంట

అన్నదాతకు నష్టం

చెర్లోపల్లిలో కూలిన ఇల్లు

వాన దెబ్బ


వర్షానికి దెబ్బతిన్న వరిపంట

పెనుకొండ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి వరి పంట నేలవాలి, రైతులకు నష్టం వాటిల్లింది. మండలంలో గురువారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో మండలంలోని మంగాపురం, కోనాపురం తదితర గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగుచేసిన వరిపంటలు నేలవాలాయి. 20 రోజుల్లో పంట చేతికొస్తుందన్న సమయంలో వర్షం దెబ్బకొట్టింది. 15 ఎకరాల్లో పంట నేలవాలి తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. రొద్దం మండలంలో కూడా వరిపంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టంపై తమకు సమాచారం లేదని వ్యవసాయాధికారులు తెలిపారు.

వర్షానికి కుప్పకూలిన ఇల్లు

రొళ్ల(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి మండలంలోని చెర్లోపల్లిలో రైతుకూలీ తిప్పేస్వామికి చెందిన ఇల్లు శుక్రవారం తెల్లవారుజామున కుప్పకూలింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిప్పేస్వామి, రామక్క దంపతులు గురువారం రాత్రి ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఏదో శబ్దం రావడంతో వారు పరుగును బయటికొచ్చారు. ఇంటిపైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఇంట్లోని సరుకులు, సామగ్రి ధ్వంసమయ్యాయి. సర్వం కోల్పోయినట్లు బాధితుడు తిప్పేస్వామి వాపోయాడు.


కూలిన ఇంటి వద్ద తిప్పేస్వామి, రామక్క దంపతులు

సత్యసాయి జయంత్యుత్సవాలకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ


ప్రశాంతి నిలయంలో పరిశీలిస్తున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా జయంత్యుత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రశాంతి నిలయంలో భద్రతా ఏర్పాట్లపై సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌తో ఎస్పీ శుక్రవారం రాత్రి చర్చించారు. వేడుకలకు వచ్చే వీఐపీలు, వీవీఐపీలు, సత్యసాయి భక్తుల భద్రతపై చర్చించారు. అనంతరం ప్రశాంతినిలయంలో పలుప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. గణేష్ కూడలి, చిత్రావతి రోడ్డు, హనుమాన్‌కూడలి, రథోత్సవం నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

స్ఫూర్తిదాయకం.. బిర్సా ముండా పోరాటం: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల కోసం బిర్సాముండా సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బిర్సాముండా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బిర్సాముండా.. గిరిజనులను సమీకరించి, ఉద్యమం చేశారన్నారు. ప్రజల పక్షాన బ్రిటీషు వారికి వ్యతిరేకరంగా పలు పోరాటాలు చేసి, అరెస్టయ్యారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏఓ వెంకటనారాయణ కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.


బిర్సాముండాకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ చేతన్



దీపాలతో హారతులు..



హెచ్చెల్సీ వద్ద పూజలు..





చన్నీటి స్నానం..



గంగలో దీపాలు వదిలేస్తూ..

వెలుగెత్తిన దీపాలు



శివ శివా..

నేత్రపర్వంగా కార్తీక దీపోత్సవం

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


అనంతపురం కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలను జిల్లా ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే శైవాలయాలకు భక్తులు పోటెత్తారు. చిన్నారులు, మహిళలు తమ భక్తిని ప్రమిదలుగా వెలిగించి కైలాసనాథుడిని ఆరాధించారు. హర నామ స్మరణతో ఆయా ఆలయాలు ప్రతిధ్వనించాయి. జిల్లాకేంద్రంలోని హెచ్చెల్సీ కెనాల్‌లో పలువురు మాలధారులు, మహిళలు వేకువజామునే చన్నీటి స్నానాలాచరించి, కార్తీక దీపాలను వదిలారు. మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఉదయం నుంచి కాశీవిశ్వేశ్వరునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు పెద్దఎత్తున దీపాలు వెలిగించారు. రాత్రికి స్వామివారికి దశహారతులు సమర్పించిన అనంతరం ఊయ్యాల సేవ నిర్వహించారు. నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా కార్తీక దీపోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.



కార్తీక శోభ..



1వ రోడ్డు శివాలయంలో కార్తీక దీపోత్సవానికి పోటెత్తిన భక్తజనం



ఆరనీకుమా ఈ దీపం..



ఈశ్వరా.. పరమేశ్వరా..



అరవింద్‌నగర్ శివాలయంలో దీపాలు వెలిగిస్తూ...



గీతామందిర్‌లో క్షీరాభిషేకం..





శివకోటిలో శివలింగానికి హారతుల వెల్లువ.. దీపాలు వెలిగిస్తూ..

'మహాప్రస్థానం' ప్రారంభించిన ఎంపీ అంబికా



మహాప్రస్థానం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురంటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో మృతదేహాలను తరలించడానికి మంజూరైన మహాప్రస్థానం వాహనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ ఉన్నవాహనం పాతబడటంతో పాటు మృతదేహాలు తరలించడానికి పేదలు ఇబ్బంది పడుతుండటంతో గతంలో ఉన్న ఎంపీ తలారిరంగయ్య ఎంపీ నిధులు మంజూరు చేశారు. వాటితో కొనుగోలు చేసిన నూతన వాహనం శుక్రవారం ఆస్పత్రికి వచ్చింది. దాన్ని ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన చికిత్స అందించాలని, ఆస్పత్రికి అవసరమైన సహకారం తాను అందిస్తానని ఆయన డాక్టర్లకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, డాక్టర్ నవీన్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణితో పాటు పలువురు డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో సీడాప్ అధికారులు, ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

113 మందికి ఉద్యోగాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు, సీడాప్‌ఎల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ కంపెనీలో రిలేషన్‌షిప్ ఆఫీసర్ ఉద్యోగాలకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 435మంది హాజరు కాగా....113మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు కాలేజి ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, సీడాప్ జేడీఎం సూర్యనారాయణ నియామకపత్రాలు అందజేశారు. ఎంపికైన వారు అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, కదిరి, పెనుకొండ, హిందూపురం, గోరంట్లలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సీడాప్ ఏపీ ఛైర్మన్ దీపకొరెడ్డి, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ ఇన్‌చార్జ్ వెంకటేష్, సీడాప్ ట్రైనర్ నారాయణస్వామి, మునీంద్ర, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల ఉచిత శిక్షణకు జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24లోపు అనంతపురంలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. బీసీలో 66 శాతం, ఎస్సీల్లో 20 శాతం, ఎస్టీల్లో 14 శాతం మందిని రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన వారికి విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు బుక్కు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బీసీ స్టడీ సర్కిల్‌లో అందజేయాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు ఫోన్ : 08554-275575, సెల్ : 7799043773కు సంప్రదించాలన్నారు.

టమోటా కిలో రూ.23



అనంతపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలి

పీఆర్టీయూ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, కరువుభత్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలని పీఆర్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, ప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి ఇతర నాయకులు మాట్లాడారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాల బకాయిలు తక్షణం చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సంపాదిత సెలవుల నగదు జమ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన సొమ్ము వారి ఖాతాల్లో పడేలా చూడాలన్నారు. నెలవారీ ప్రమోషన్లు ఇచ్చి, హైస్కూళ్లలో ఖాళీ పడిన ప్రధానోపాధ్యాయ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీవో117 రద్దు చేయడంతోపాటు, 3,4,5 క్లాసులను హైస్కూళ్ల నుంచి పూర్వపు ప్రైమరీ స్కూళ్లకు పంపాలన్నారు. ఎంఈఓల మాదిరిగానే..ప్రతి డివిజన్‌కు ఇద్దరు డిప్యూటీ డీఈఓలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకుల కేశవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, వేమారెడ్డి, రామ్మూర్తి, రామ్మోహన్‌రెడ్డి, ఎల్లప్ప, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మత్తుతో జీవితాలు నాశనం

అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు

ఇప్పటికే 23మంది గుర్తింపు, 11 మందికి రిమాండ్

మత్తు నివారణ సమీక్షలో కలెక్టరు, ఎస్పీ



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు, ఎస్పీ

అనంతపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితాలు నాశనమవుతాయని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. మత్తు పదార్థాలను అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మత్తునివారణ జిల్లా కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు విక్రయించకుండా, వినియోగించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలలో ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కొన్ని కాలేజీలలో ప్రహరిక్లబ్‌లు ఫెయిల్ అయినట్లు ఎస్పీ చెబుతున్నారు. ఆవివరాలు ఎస్పీ నుంచి తీసుకొని ఆవిద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఇంటర్ విద్యఅధికారిని కలెక్టరు ఆదేశించారు.ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ప్రహరిక్లబ్ నిర్వహించాలని, దీనికి డీవీఈఓ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించాలని సూచించారు. పిల్లలకు పుస్తకపఠనం, యోగా, క్రీడలు వంటి అంశాలపై ఆసక్తి పెంచేలా ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు చూడాలని ఆదేశించారు. మత్తు వల్లకలిగే నష్టాలు, వాటిని అమ్మినా, వినియోగించినా చట్టపరంగా ఎలాంటి చర్యలు ఉంటాయో పిల్లలకు అవగాహన కల్పించాలని కలెక్టరు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. జిల్లాలో డ్రాపౌట్స్ వివరాలు పక్కా సమాచారంతో అందించాలని ఆదేశించారు. మత్తుకు బానిసైన వారికి వైద్యచికిత్సలు అందించడం కోసం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్‌సెంటర్‌లో అన్ని వసతులు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. నిధులు అవసరమైతే జనరల్‌ఫండ్స్ కింద తీసుకోవాలని సూపరింటెండెంట్‌కు కలెక్టరు సూచించారు.

● రెండు కాలేజీలు, 9మంది విద్యార్థుల గుర్తింపు: ఎస్పీ

జిల్లాలో మత్తు పదార్థాల నివారణకు గట్టి చర్యలు తీసుకుంటామని ఎస్పీ జగదీష్ వెల్లడించారు. గత నెలలో ఐదు కేసులకు సంబంధించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో కేసులో 20మందిని గుర్తించామని వీరిలో 11మందిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఇందులో రెండు కాలేజ్‌లకు చెందిన 9మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఆయాకళాశాలల యాజమాన్యాలకు వారి వివరాలు తెలియజేశామన్నారు. రెండురోజుల కిందట కూడా పాతూరు వన్‌టౌన్ పరిధిలో రెండు చిన్నప్యాకెట్లును గుర్తించినట్లు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు అమ్మినా, వినియోగించినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. సమీక్షలో ఆర్డీఓ వసంతబాబు, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, డీవీఈఓ వెంకటరమణానాయక్, డీటీసీ రసూల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఖుష్బూ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్‌తో అనర్థాలు

అధికంగా వాడితే ప్రమాదమే

అవగాహన సదస్సులో వైద్యాధికారులు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యాధులు త్వరగా నయం కావాలని ఇష్టానుసారం యాంటీబయాటిక్ మందులు వాడితే అనర్థాలు అధికంగా ఉంటాయని వైద్యాధికారులు ప్రజలకు సూచించారు. జాతీయ నవజాత శిశుసంరక్షణ వారోత్సవాల సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, డీఐఓడాక్టర్ యుగంధర్, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నవజాతశిశువులు వ్యాధుల బారిన పడినపుడు ఆస్పత్రిలోని డాక్టర్లకు చూపించి, వారు ఇచ్చిన మందులను మాత్రమే వాడాలన్నారు. గర్భిణులు, బాలింతలు కూడా అధిక డోసేజ్ ఉన్న యాంటిబయాటిక్స్ మందులు వాడకూడదని సూచించారు. ఈ యాంటీబయాటిక్ మందుల వల్ల కలిగే అనర్థాలపై ఈనెల 21వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికి తెగుళ్లు

పైరును ఆశించిన గులాబి రంగు చీడ

ఇళ్లలో నిల్వ ఉంచిన పత్తికి ఎర్ర పురుగు



గులాబీ రంగు పురుగు ఆశించిన పత్తి కాయలు



ట్రాక్టరుతో పత్తి పంట తొలగింపు..

గుత్తి రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి):పత్తికి గులాబీ రంగు చీడ ఎర్ర తెగుళ్ల పచ్చపురుగు ఆశించడంతో వందలాది ఎకరాలలో పంట నాశనమవుతోంది. వర్షం అధికం కావడంతో తెగుళ్ల సోకి పత్తి పంటను గుల్ల చేస్తున్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 1000హెక్టార్లలో పత్తి పంటను సాగుచేశారు. పత్తి పంటను వర్షాలకు అనుగుణంగా మూడు దఫాలుగా సాగు చేశారు. ఎకరాకు 15 వేల నుంచి 20 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. పంట సరిగా పండితే ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకూ దిగుబడి వస్తుంది. తెగుళ్ల పంటను నాశనం చేస్తుండడంతో ప్రస్తుతం 3 నుంచి 5 క్వింటాళ్ల వరకూ మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కాయలలోకి గులాబీ రంగు పురుగు ప్రవేశించి నాశనం చేస్తుంది పురుగు నివారణకు పలు రకాల మందులు పిచ్చికారి చేసిన ఫలితం లేకుండాపోతుంది. రెండు సార్లు సత్తవ మందును విత్తారు. వర్షాలకు పత్తి పంట ఎర్ర తెగుళ్లలకు కాయలని నలపు, ఎరుపు రంగులో మారి పత్తి కాయలు పగలకుండ బుజు పట్టి నేల రాలి పోతున్నాయి. ఆగస్టు మాసంలో వర్షాలు రాక పోవడంతో పత్తికి ఉన్న పూత పిందేలు రాలి పోయాయి. ప్రస్తుతం పత్తి పంటకు తెగుళ్ల ఆశించడంతో ఈ ఎడాది ఆశించిన విదంగా పత్తి పంట రాలేదని రైతులు అంటున్నారు. పత్తిని తొలగించిన పంటను ఇళ్లలో ఉంచారు. నిల్వ ఉంచిన పత్తి పంటకు ఎర్రపురుగు ఆశించింది. వాటిని అమ్ముకొవాలంటే పత్తి తుకం తగ్గుతుందన్నారు.



తెగుళ్లు, చీడలతో నష్టపోయా

నేను 8 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశాను పత్తి పంటకు 5సార్లు మందు పిచికారీ చేశా. రెండుసార్లు సత్తవ మందు వేశాను ఇప్పటి వరకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టాను గులాబీ రంగు పురుగు, ఎర్ర ఎర్ర తెగుళ్ల సోకడంతో పంట దిగ్గుబడి తగ్గి పోయింది. వాటికి ఉన్న పత్తికాయలు నేల రాలుతున్నాయి. తెగుళ్లతో నష్ట పోతున్నాము.

\- సూర్యనారాయణ, బేతాపల్లి

తెగుళ్లను నివారించవచ్చు

పత్తి పంటకు ఎర్ర తెగులు అశించి ఉంటే ఎకరానికి ఒక లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేపనూనె కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే 300 గ్రాముల థయోడికార్బ్ లేగా 500 ఎం.ఎల్ క్లోరోఫైరిపాస్ ఉదయం పూట పిచికారి చేయాలి. గులాబీ రంగు పురుగు ఆశించి ఉంటే ఎకరానికి 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. - వెంకటరాముడు, ఏడీఏ, గుత్తి

పత్తి దిగుబడి శూన్యం

నేను 5 ఎకరాలలో పత్తిపంట సాగు చేశాను. ఆగస్టు మాసంలో అరకొర వర్షం వచ్చింది. వర్షం వచ్చింటే పత్తి కొంత వరకు దిగుబడి వచ్చేది. వర్షం రాక పోవడంతో బెట్ట పోయి పత్తి చేట్టుకు ఉన్న పూత పిందేలు రాలిపోయాయి. ప్రస్తుతం వర్షలు ఎక్కువగా రావడంతో పత్తి కాయలు నల్లగా మారి పత్తి పగలకుండ బుజు పట్టి నల్లగా అయిపోలున్నాయి. ఈ ఎడాది పత్తి దిగుబడి శూన్యం.

\- రైతు రంగప్ప, బేతాపల్లి



క్రైం కార్నర్

బాలుడి నడుములో కొయ్య



అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

కణేకల్లు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో రేగుపండ్ల కోసం చెట్టెక్కిన ఇర్ఫాన్ అనే బాలుడు ప్రమాదవశాత్తూ కింద పడ్డాడు. దీంతో విద్యార్థి నడుములోకి కొయ్య దూసుకెళ్లింది. కణేకల్లు తారకరామ్‌నగర్ కొట్టాలకు చెందిన దాదావలి కుమారుడు ఇర్ఫాన్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. గౌరమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం ఆప్షనల్ హాలిడే ఇచ్చారు. దీంతో ఇర్ఫాన్ స్నేహితులతో కలిసి రేగుచెట్టుపైకి ఎక్కి కాయలను కోస్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. చెట్టుకింద ఉన్న ఓ పదునైన కొయ్యపై పడటంతో నేరుగా ఇర్ఫాన్ నడుము భాగంలోకి దూసుకెళ్లింది. బాలుడి కేకలు విన్న స్థానికులు వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

కేబుల్ వైరు చోరీ



కేబుల్ వైరు చోరీ అయిన మోటర్

శింగనమల, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయనవారిపల్లిలో గురువారం రాత్రి 21 వ్యవసాయ మోటార్లకు చెందిన రెండు వేల మీటర్ల కేబుల్ వైరు చోరీ అయ్యింది. గ్రామానికి చెందిన గుత్తా ఆదినారాయణ మూడు మోటార్లు, సురేష్ 3, వెంకటనారాయణ 3, పాలరాజు 3, రామానాయుడు 3, బాలాజి 3, చాకలి రామాంజనేయులుకు చెందిన మూడు మోటార్ల కేబుల్ వైరును చోరీ చేశారు. ఒకే రోజు రాత్రి ఇన్ని మోటార్ల కేబుల్ వైరు చోరీ అవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఈ చోరీల విషయమై తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

జడ్పీ సీఈఓకు అస్వస్థత



సీఈఓను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం విద్య, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఇన్‌చార్జ్ సీఈఓ వెంకటసుబ్బయ్య అస్వస్థతకు గురయ్యారు. పని మీద శుక్రవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌కు వెళ్లారు. జిల్లా పరిషత్ ఉద్యోగ వర్గాల సమాచారం మేరకు సీఈఓ కలెక్టరేట్‌లో కొంత ఒత్తిడికి లోనైనట్లు తెలిసింది. అక్కడికి వెళ్లిన 15 నిమిషాలకు టెన్షన్‌కు గురికావడంతో అస్వస్థతకు గురైనట్టు తెలిసింది. దీంతో అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బీపీ ఎక్కువ ఉండటంతో వైద్య పరీక్షల అనంతరం సాయినగర్ 1వ క్రాస్‌లో ఉన్న మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే వైద్య సేవలు అందించారు. తర్వాత కొంత ఉపశమనం పొందడంతో సాయంత్రం జడ్పీలోని అతిథి గృహానికి తరలించారు. విషయం తెలుసుకున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పలు విభాగాల ఉద్యోగులు ఆయనను పరామర్శించారు. మూడు రోజులపాటు విశ్రాంతి తీసుకోమని వైద్యులు సూచించినట్లు జడ్పీ వర్గాల సమాచారం.

డిసెంబరు 16లోగా చంపేస్తా..!



అనంతపురం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'డిసెంబరు 16వ తేదీ డెడ్‌లైన్..! ఆ లోపు నిన్ను చంపేస్తా' అని గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెసేజ్‌లు వస్తున్నాయని బాధితుడు వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. నగరంలోని కురుబ గేరికి చెందిన నాగార్జున బంగారు నగల తయారీ పని చేస్తుంటాడు. రెండు వారాలుగా అతని మొబైల్ ఫోన్‌కు 9346726667 నంబరు నుంచి ఓ మెసేజ్ వస్తోంది. చంపేస్తామని బెదిరిస్తూ మెసేజ్ పంపుతున్నారు. ఆ నంబర్‌కు ఫోన్ చేసినా అతవలి వ్యక్తి స్పందించడం లేదని బాధితుడు వాపోయాడు. డిసెంబరు 16 డెడ్‌లైన్ అనడంతో ఆందోళన చెంది.. శుక్రవారం రాత్రి వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1052 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు 1052 క్యూసెక్కుల వరద నీరు చేరుతోందని హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా-2కు 978 క్యూసెక్కుల నీరు వెళుతోందని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.571 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గోల్.. గోల్.. గోల్..!

- ఏకపక్షంగా సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు
- కర్ణాటక, తమిళనాడు జట్ల ఘన విజయం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సంతోష్ ట్రోఫీ-2024 ఫుట్‌బాల్ పోటీలు ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలిండియా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే, జేసీ శివ నారాయణశర్మ, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ఈ పోటీలను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో తమిళనాడు జట్టు 7-0 గోల్స్ తేడాతో అండమాన్ నికోబర్‌పై విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో కర్ణాటక జట్టు 5-0 తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. రెండు మ్యాచ్‌లూ ఏకపక్షంగా సాగాయి. తమిళనాడు జట్టు ఆటగాళ్లు అలెగ్జాండర్ రేమియో, లీజో చెరో రెండు గోల్స్ కొట్టారు. విక్రం వెంకటాచలం, నందకుమార్ అనంతరాజ్ చెరో గోల్ కొట్టారు. అండమాన్ నికోబర్ జట్టు ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. కర్ణాటక ఆటగాడు అభిషేక్ శంకర్ పవార్ 3 గోల్స్, రుద్రవేద్, అశ్విన్ చక్రవర్తి చెరో గోల్ కొట్టారు. ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ జట్టు ఒక్క గోల్ కూడా సాధించలేకపోవడం క్రీడాభిమానులను నిరుత్సాహపరిచింది. రెండు ఆటలకూ వర్షం కారణంగా పలుమార్లు అంతరాయం ఏర్పడింది. మ్యాచ్‌ల ప్రారంభానికి ముందు కళ్యాణ్ చౌబే మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన ఫుట్‌బాల్‌ను రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆర్డీటీ స్టేడియంలో క్రీడా సదుపాయాలు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నాయని అభినందించారు. సంతోష్ ట్రోఫీ పోటీలకు జిల్లా వేదిక కావడం శుభపరిణామమని జేసీ శివనారాయణ శర్మ అన్నారు. పోటీలను విజయవంతం చేయడానికి ఆర్డీటీతో కలిసి ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. అనంతపురాన్ని క్రీడా రాజధానిగా మార్చేందుకు కొత్త ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తామని కొత్త ప్రభుత్వం అన్నారు.



ఆంధ్రప్రదేశ్, కర్ణాటక జట్లతో అతిథులు





వర్షంలోనే తలపడుతున్న ఆంధ్రా-కర్ణాటక జట్లు



కుర్చీలు లేక నిలబడి మ్యాచ్ తిలకిస్తున్న విద్యార్థులు

ఎస్సీ వర్గీకరణ చట్టం చేయాలి: ఎమ్మార్పీఎస్



సభలో ప్రసంగిస్తున్న కృపాకర్ మాదిగ

అనంతపురం సెంట్రల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేసి తక్షణమే చట్టం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణకు కోర్టులో కేసువేసి గెలిచిన సభ్యులకు శుక్రవారం సత్కార మహాసభను నిర్వహించారు. మాదిగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహంవద్ద ఏర్పాటు చేసిన సభకు అక్కులప్ప అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు కృపాకర్ మాదిగ, ఆర్జే ప్రకాష్ మాదిగ, లాయర్ గిరిధర్ మాదిగ హాజరయ్యారు. వర్గీకరణ పోరాట ఉద్యమ గళాన్ని గ్రామీణ ప్రాంతాలనుంచి దేశ రాజధాని ఢిల్లీ వరకు వినిపించారని కొనియాడారు. ఈ క్రమంలో ఎంతోమంది వృత్తి, ఉద్యోగ ఆదాయాలు, కుటుంబ జీవితాలను కోల్పోయారని అన్నారు. కలెక్టరేట్ వద్ద తెల్లబండ్ల రవి ఆత్మబలిదానం చేశారని గుర్తు చేసుకున్నారు. మాదిగ దండోరా ఉద్యమం ఎమ్మార్పీఎస్‌గా అవతరించి, వర్గీకరణపై ఉమ్మడి పోరాటాలు చేశామని అన్నారు. దండోరా ఉద్యమం వ్యవస్థలను కదిలించిందని అన్నారు. మాదిగల కోరిక న్యాయమైనదని, తీర్చాల్సిందేనని 1997లో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ ప్రభుత్వానికి నివేదించిందని అన్నారు. మాదిగలకు హక్కులను కల్పించాల్సిందేనని మీడియా, రాజకీయపార్టీలు బలపర్చాయని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వర్గీకరణపై 2000లో అసెంబ్లీలో పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారని, మాల సామాజిక ఎమ్మెల్యేలు కూడా ఓటువేశారని గుర్తుచేశారు. మాల సామాజికవర్గంలో పిడికెడు మంది మాత్రమే వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. అలాంటి వారి ప్రయత్నాలు విఫలమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ స్వామి, ఆనంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో మూడు టీఎంసీల నీరు



పీఏబీఆర్‌లో నీటి మట్టం

కూడేరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు మూడు టీఎంసీలకు చేరాయి. తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్‌లోకి 258 క్యూస్కెల నీరు చేరుతోంది. డ్యాంలో శుక్రవారం 430.70 అడుగుల వద్ద 3.029 టీఎంసీల నిల్వలు నమోదయ్యాయని ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు. తాగు నీటి పథకాలకు 95 క్యూస్కెల నీటిని వదులుతున్నారు. ఇన్‌ఫ్లో తక్కువ ఉన్న కారణంగా నీటి మట్టం అంతంత మాత్రంగానే పెరుగుతోంది.

విద్యాసంస్థల్లో ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతి లేదు

కొత్తచెరువు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో రాజకీయ, మత, వివాహ తదితర ప్రైవేటు కార్యక్రమాలకు ఇక నుంచి అనుమతి ఉండదని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శుభకార్యాలు, రాజకీయ సమావేశాలకు అనుమతులు ఇచ్చేవారు. దీంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగేది. దీనిని నివారించేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడాన్ని రద్దు చేస్తున్నట్లు ఏడీ తెలిపారు.

వైసీపీ సోషల్ సైకో ఇంటికి నోటీసు

- నాలుగు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశాలు



అమర్‌నాథ్ రెడ్డి ఇంటికి నోటీసు అతికించిన పోలీసులు

కదిరి/అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరచెన్నయ్యగారిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అమర్‌నాథ్ రెడ్డి ఇంటికి విశాఖపట్నం వన్‌టౌన్ సీఐ దేవుడుబాబు శుక్రవారం నోటీసు అతికించారు. కదిరి అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌పై అమర్‌నాథ్‌రెడ్డి సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడంతోపాటు గంజాయి ముఠాతో సంబంధాలున్నాయనీ, వీరే సూత్రధారులని అసత్య ప్రసారాలు చేశాడు. దీనిపై విశాఖ వన్‌టౌన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో విశాఖ పోలీసులు.. అమర్‌నాథ్ రెడ్డికి నోటీసులు ఇవ్వడానికి శుక్రవారం వీరచెన్నయ్యగారిపల్లికి చేరుకున్నారు. ఆ సమయంలో అతడు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు ఇవ్వబోగా వారు నిరాకరించారు. దీంతో నోటీసులు ఇంటికి అతికించారు. నాలుగురోజుల్లోగా సమాధానం ఇవ్వకపోతే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని అందులో సీఐ పేర్కొన్నారు.

తామరను తుంచండి

- మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మిరప పంటలో తామర పురుగు నివారణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 35 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో మిరప పంటను సాగు చేశారన్నారు.పండిస్తున్నారన్నారు. మిరప పూతను నల్లతామర పురుగు ఆశించి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తోందన్నారు. మిరపతోపాటు మామిడి, మునగ, టమోటా, చిక్కుడు, దొండ, బండి, కాకర, బొప్పాయి, పత్తి తదితర పంటలను ఆశించిన విపరీతమైన నష్టాన్ని కలిగిస్తోందన్నారు. పొలంలో పంట లేని సమయంలో గడ్డి చామంతి, ఇతర గడ్డి జాతి మొక్కలు, వయ్యారి భామ తదితర కలుపు మొక్కలపై నివాసం ఉండి మిరపలో పూత దశ ఆరంభమైన సమయంలో ఆశించి రసం పీల్చడం ద్వారా పూత నుంచి పిందె ఏర్పడకుండా చేస్తుందన్నారు. తల్లి పురుగులు నలుపు రంగులో పువ్వులు, లేత ఆకుల మీద వ్యాపించి ఉంటాయన్నారు. మగ పురుగులు లేత పసుపు రంగులో పరిమాణంలో చిన్నవిగా తక్కువ సంఖ్యలో ఉంటాయన్నారు. నివారణ కోసం పంట మార్పిడి చేసుకోవాలన్నారు. వేసవిలో లోతుగా దుక్కులు చేసుకోవడం ద్వారా పురుగు కోశస్థ దశలను నివారించుకోవచ్చునన్నారు. పచ్చిరొట్ట పైరును వేసి భూమిలో కలియదున్నాలని సూచించారు. జీవన శిలీంధ్ర నాశని ట్రైకో డెర్మా విరిడి 2 కిలోలు, సుడోమోనాస్ 2 కిలోలు, మెటరిజీఎం 2 కిలోలతో వృద్ధి చేసిన ఒక టన్ను పశువుల ఎరువును, జీవన ఎరువులు అజాస్పిరిల్లుం, ఫాస్ఫో బాక్టీరియా, పొటాష్ బ్యాక్టీరియాను ఎకరాకు 2 కిలోల చొప్పున కలిపి భూమిలో కలియదున్నాలన్నారు. పంట చుట్టూ రెండు నుంచి మూడు వరుసలు రక్షక పంటగా జొన్న లేదా మొక్కజొన్న పంటలను వేసుకోవాలన్నారు. తామర పురుగు ఉధృతిని తట్టుకునే మన ప్రాంతానికి అనువైన హైబ్రీడ్ రకాలు వేసుకోవాలని సూచించారు.

హక్కుల కోసం అలుపెరగని పోరాటం

- మజ్దూరు యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు



మాట్లాడుతున్న శంకర్‌రావు

గుత్తి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కారం, హక్కుల సాధనకు తమ యూనియన్ అలుపెరగని పోరాటాలు చేసిందని దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ జాతీయ కోశాధికారి సీహెచ్ శంకర్‌రావు పేర్కొన్నారు. స్థానిక రైల్వే డీజిల్ షెడ్‌లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం షెడ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 4నుంచి మూడు రోజుల పాటు జరిగే గుర్తింపు రైల్వే సంఘాల ఎన్నికల్లో మజ్దూరు యూనియన్ జెండా గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సీఅండ్‌డబ్ల్యు, కంట్రోలర్ లాబీ, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా పత్తికొండ రోడ్డు సర్కిల్‌లో మజ్దూరు యూనియన్ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడ జ్యోతిరావుఫూలే, అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి డీజిల్ షెడ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజనల్ సెక్రెటరీ విజయ్‌కుమార్, కోశాధికారి శర్మ, ఏడీఎస్ నారాయణ, మజ్దూరు యూనియన్ నాయకులు నారాయణ, శేఖర్‌బాబు, రామాంజనేయులు రెడ్డి, మనోహర్, నరసింహ, సుదీర్, విశ్రాంతఅసోసియేషన్ కార్యదర్శి మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఊరికిచ్చిన మాట..!

- ఎన్నికల హామీకి కార్యరూపం
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం
- 'దుర్గం'లో పారిశుధ్య సమస్యకు చెక్
- ఎమ్మెల్యే అమిలినేని చొరవతో సాగుతున్న పనులు



పట్టణంలోని గాంధీ సర్కిల్ ప్రధాన రహదారిలో పారుతున్న మురుగు నీరు

కళ్యాణదుర్గం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో కూడాలేని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి మున్సిపాలిటీ అయిన కళ్యాణదుర్గంలో శ్రీకారం చుట్టారు. పట్టణంలో కొన్నేళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వాలు మారినా కళ్యాణదుర్గంలో డ్రైనేజీ వ్యవస్థను మార్చలేక పోయారు. చిన్నపాటి వర్షం వచ్చినా కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి గాంధీ సర్కిల్, టీ సర్కిల్ నుంచి మురుగు మొత్తం ప్రధాన దారి గుండా ప్రవహిస్తుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీన్ని గమనించిన అమిలినేని సురేంద్రబాబు తాను ఎమ్మెల్యేగా గెలిస్తే పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయిస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్అండ్‌బీ, మున్సిపాల్టీ అధికారుల సమన్వయంతో ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. పట్టణంలోని పాతబస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. పట్టణంలోని టీ సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు లోతట్టు ప్రాంతం కావడంతో వర్షపునీరు చేరి ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా ఉండేవి. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి ప్రధాన రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తున్నారు. ఇందులో ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులు భాగస్వాములై ప్రత్యేక నిధులు ఖర్చుచేయనున్నారు. మున్సిపాల్టీ నుంచి రూ. 3.5కోట్లను అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి ఖర్చు చేయనున్నారు. ఎత్తు ప్రాంతంలో ఉన్న కోట వీధి నుంచి మురుగు, వర్షపునీరు వెళ్లేందుకు 400 మీటర్ల పొడవునా కాలువను నిర్మించనున్నారు. ఆ నీటిని నేరుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ద్వారా విరక్తి గవిమఠం వద్ద కలుపుతారు. ఆ మురుగునీరు సాయిబాబా ఆలయం వద్ద ఉన్న కాలువ గుండా వెళ్లేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జనం ఎన్నుకున్న ప్రజాప్రతినిధికి విజన్ ఉంటే అభివృద్ధికి ఎలా అడుగులు పడతాయో అనేందుకు ఈ సంఘటన ఒక ఉదాహరణగా నిలుస్తోందని పట్టణ ప్రజలు పేర్కొంన్నారు.



పట్టణంలోని పాతబస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి తవ్విన గుంత

ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతాం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి మురుగు సమస్యకు స్వస్తి పలకడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. కొన్నేళ్ల నుంచి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీన్ని గమనించి, ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు పూనుకున్నాం. పాత బస్టాండు వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి కల్వర్టు నిర్మించి సజావుగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపడతాం. అభివృద్ధిలో ఆదర్శ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతాం.

- అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం


కదిరి: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఊంజలసేవ


బుక్కపట్నం : శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పుట్టపర్తి : శివాలయంలో కార్తీక దీపారాధన చేస్తున్న మహిళలు

కార్తీక వెలుగులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాల వెలుగుల్లో మరింత శోభను సంతరించుకున్నాయి. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పుట్టపర్తిలోని హనుమాన్‌కూడలిలోని శివాలయం, సత్యసాయిబాబా పుట్టిన స్థలంలో ఉన్న శివాలయంలో మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. కదిరి శివాలయంలో జ్వాలా తోరణం వెలిగించారు. ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేతంగా లక్ష్మీనరసింహస్వామికి ఊయ్యాలసేవ నిర్వహించారు. ధర్మవరంలోని రమణ మహర్షి ఆశ్రమంలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. బసవన్నకట్ట వీధిలోని త్రిలింగేశ్వరుడు ఆలయంలో జ్వాలా తోరణం వెలిగించారు. పెద్దఎత్తున మహిళలు దీపాలు వెలిగించారు. అలాగే బుక్కపట్నం, నల్లచెరువు, ఓడీసీ, తాడిమర్రి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ధర్మవరం : త్రిలింగేశ్వరుడు ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


ధర్మవరం : రమణ మహర్షి ఆశ్రమంలో గోపూజ చేస్తున్న భక్తులు


నల్లచెరువు : గీతామందిరంలో భజన చేస్తున్న భక్తులు


ఓడీసీ : అయ్యప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


పుట్టపర్తి, కదిరిలో ప్రత్యేక అలంకరణలో శివలింగాలు

సబ్ జైలు తనిఖీ


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి

ధర్మవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సబ్‌జైల్‌ను జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్‌యాదవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బ్యారెక్, వంటగది, స్టోర్‌రూమ్, రికార్డులు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమస్యలపై ఆరా తీశారు. వైద్యసేవలు, ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసుల్లో వారించేందుకు న్యాయవాదులు లేకపోతే లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ బ్రహ్మంరెడ్డి, న్యాయవాది బాలసుందరి పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న వరిపంట

ధర్మవరం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గురువారం రాత్రి కురిసిన వర్షానికి వరిపంట పూర్తిగా దెబ్బతింది. చింతలపల్లి గ్రామంలో రైతులు అన్నమనేనిగోపాల్, శ్రీనివాసులు, శంకర్‌నాయుడు సాగుచేసిన వరిపంట దిగుబడి వచ్చి ఏపుగా పెరిగింది. ఇంకో 20 రోజుల్లో పంట కోసి చేతికొచ్చే సమయంలో ఈ వర్షం రావడంతో.. పంట నష్టపోయి.. రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నారు. వరిగింజలు రాలిపోతున్నాయని ఆందోళన పడుతున్నారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.


వార్డెన్‌పై ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న విలేకరులు

బీసీ హాస్టల్ వార్డెన్‌పై ఫిర్యాదు

నల్లచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీసీ హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో విలేకరులు ఫిర్యాదు చేశారు. హాస్టల్ వార్డెన్‌పై వార్త రాసిన పాత్రికేయులపై లక్ష్మీనారాయణ దురుసుగా ప్రవర్తించారని, నడి రోడ్డుపై దుర్భాషలాడారని ఎస్ఐ మగ్బుల్‌బాషాకు ఫిర్యాదు చేశామని ఆ పాత్రికేయులు తెలిపారు.

కత్తితో దాడి

ధర్మవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శివానగర్‌లో శివపై ఆచారి అనే వ్యక్తి కత్తితో శుక్రవారం రాత్రి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. శివానగర్‌లో ఆచారీ, శివ బాడుగ ఇళ్లల్లో ఉంటున్నారు. వీరి ఇళ్లు ఒకే కాంపౌండ్‌లో ఉన్నాయి. మిద్దెపైకి వెళ్లడానికి మెట్లు ఒకటే. శుక్రవారం శివ మిద్దెపైకి వెళ్తుండగా తనకు చెప్పకుండా మిద్దెపైకి వెళ్తావా అంటూ ఆచారీ గొడవ పెట్టుకున్నాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ పెరిగి.. ఆచారి కత్తితో శివను దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో శివాను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు ఆస్పత్రికి వెళ్లి ఆరా తీశారు. శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ ధర్మవరం సమన్వయకర్తగా నరేశ్



ధర్మవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్తగా పట్టణానికి చెందిన యనమల నరేశ్‌ను నియమిస్తూ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలో అందరిని కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని నరేశ్ పేర్కొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

నల్లచెరువు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై డ్రిపులు, స్పింకర్లు కావలసిన రైతులు.. రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ భారతి, ఉద్యానశాఖ లావణ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కునుకుంట్ల కుంటకు కచ్చితంగా నీరు తెస్తాం

రైతులకు పరిటాల శ్రీరామ్ హామీ


సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

తాడిమర్రి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారులతో చర్చించి కునుకుంట్ల కుంటకు కచ్చితంగా పీబీసీకి నీరందిస్తానని టీడీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ రైతులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం నార్పల మండలం తుంపరదీప్‌కట్ వద్ద పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు అడ్డుగా వేసిన షెట్లర్లను పరిశీలించారు. అనంతరం కునుకుంట గ్రామ సమీపం నుంచి దేశాయి సింగప్పకుంటకు నీరందించే పైపులైన్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పీబీసీ నీటి కేటాయింపులు ఉన్నప్పటికి గత ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నీరు ఇవ్వలేదన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. కాలువ నీరు రాకపోవడంతో వర్షాకాలంలో కూడా రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించుకునే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. కాలువకు నీరు అందించాలని ఆదేశాలు ఉన్నప్పటికి నీరు ఇవ్వకపోవడం సరైందికాదన్నారు. దీనిపై కలెక్టర్‌ను కలిసి శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన అన్నారు. తాడిమర్రిలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితుడు శ్రీరాములును కలిసి వైసీపీ ప్రభుత్వ హయాంలో తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. ఇందుకు పరిటాల శ్రీరామ్ స్పందిస్తూ గ్రామంలో రోడ్డు విస్తరణకు అనుమతులు లేవని, నిధులు కూడా విడుదల కాలేదని, అయినా కక్షపూరితంగా ఇళ్లు కూల్చారని, బాధితులకు న్యాయంజరిగేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, నాయకులు హర్ష, శ్రీనివాసరెడ్డి, యల్లప్ప, సతీశ్‌రెడ్డి, కొడిదెలరాజశేఖర్, సాయి పాల్గొన్నారు.

ముదిగుబ్బలో ప్రభుత్వ భూమిని కాపాడండి

ధర్మవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ముదిగుబ్బ మండలంలోని ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు కబ్జా చేసి.. విక్రయిస్తున్నారని, ఆ భూమిని కాపాడాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం వారు స్థానిక ఆర్డీఓ కార్యాలయ అధికారిణి లక్ష్మీదేవికి వినతి పత్రం ఇచ్చినవారు మాట్లాడారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముదిగుబ్బ మండలం జీకేపల్లి గ్రామపరిధిలోని రాళ్ల అనంతపురం వద్ద 50, 51, 39, 49ఏ సర్వే నెంబర్లలోని భూమిని సెంట్ల ప్రకా రం విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు ముదిగుబ్బ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోలేదని ఆరోపించారు. చివరికి ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా.. ఎటువంటి ఫలితం లేదన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినప్పుడు అక్కడున్న కొంతమంది పార్టీ కార్యకర్తలపై దాడులు చేశారన్నారు. ఇప్పటికైనా ఆర్డీఓ స్పందించి ప్రభుత్వ భూమిలో ఇళ్లు కట్టుకున్న వారికి నోటీసులు ఇచ్చి ఆ భూమిని కాపాడాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, ముదిగుబ్బ మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ ముదిగుబ్బ మండల కార్యదర్శి బండల వెంకటేశ్ పాల్గొన్నారు.


వినతి పత్రాన్ని ఇస్తున్న సీపీఎం నాయకులు

ప్రజాసమస్యలు పట్టవా..?

పుట్టపర్తి మున్సిపల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల ఆగ్రహం

సమావేశం బహిష్కరణ ... వాయిదా

పుట్టపర్తి టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు గాలికి వదిలేసి.. కేవలం కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే పుట్టపర్తి మున్సిపాలిటీ పాలకవర్గం పనిచేస్తోందని టీడీపీ కౌన్సిలర్లు మండిపడ్డారు. శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ సమావేశాన్ని మున్సిల్ ఛైర్మన్ తుంగా ఓబులేసు అధ్యక్షతన నిర్వహించారు. ప్రజా సమస్యలపై టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నప్పచౌదరి ఆధ్వర్యంలో టీడీపీ కౌన్సిర్లు ఛైర్మన్‌ను నిలదీశారు. అజెండాలో ప్రజా సమస్యలు, అభివృద్ధి గురించి చర్చించకుండా.. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం ఏమిటని మండిపడ్డారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడ చూసినా చెత్తచెదారం దిబ్బలుగా పేరుకుపోయిందన్నారు. వీధి దీపాలు వెలడంలేదని, నీటిసరఫరా అధ్వానంగా ఉందని అన్నారు. మున్సిపల్ సిబ్బందిలో ఎవరు పనిచేస్తున్నారో.. ఎవరు పనిచేయడంలేదో తెలియడంలేదన్నారు. మరో వారం రోజుల్లో సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు పుట్టపర్తిలో జరగనున్నాయని, ఈ అంశంపై ఏ మాత్రం చర్చించకుండా కాంట్రాక్టర్లకు డబ్బులు దోచి పెట్టడం కోసం టెండర్లు పిలువడంపై తీర్మాణాలు ప్రవేశపెట్టడటం ఏమిటన్నారు. 20 వార్డుల్లో 36 వీధి దీపాలుంటే ఒక్క వీధి దీపం కూడా వెలగకకపోవడం పాలకవర్గం పనితీరుకు నిదర్శనమన్నారు. సమావేశం ప్రారంభమైన వెంటనే టీడీపీ ఫ్లోర్‌లీడర్ రత్నప్పచౌదరి ఆధ్వర్యంలో టీడీపీ కౌన్సిలర్లు నిరసన వ్యక్తంచేస్తూ ఆ సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో సమావేశం వాయిదా పడింది.


మున్సిపల్ ఛైర్మన్‌తో టీడీపీ ఫ్లోర్‌లీడర్ రత్నప్ప చౌదరి వాగ్వాదం

ఏపీయూడబ్ల్యూజే కమిటీ ఏకగ్రీవం


ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం డివిజన్ నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బత్తలపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఏపీయూడబ్ల్యూజే డివిజన్ స్థాయి సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా జానపాటి మోహన్, గౌరవాధ్యక్షుడిగా విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జాంపుల అజయ్‌చౌదరి, ఉపాధ్యక్షుడిగా వీరనారప్ప, వెంకటేశ్వరచౌదరి, వెంకటనా యుడు, నరేశ్, రామకృష్ణ, గౌరవ సలహాదారులుగా శ్రావణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా చింతారమణ, ఆదినారాయణ, మహానందరెడ్డి, గురుప్రసాద్, హరికృష్ణ, ఆదినారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా గణేశ్, కోశాధికారిగా మహదేవరెడ్డి, కార్యవర్గసభ్యులుగా మదనాపు రాజశేఖర్, గోపాల్, వెంకటేశ్, సుబ్బరా యుడు, వీరనారప్ప, నాగేంద్ర, రమణ, సాకే శ్రీనివాసు లును ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఇందులో ఏపీయూ డబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య, ఐజేయూ రాష్ట్ర సభ్యుడు శ్రీనివాసులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు లెక్కల హరి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్ ...

గిరిజనులకు సాగుపట్టాలు ఇవ్వండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



పుట్టపర్తిరూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 50 సంవత్సరాలుగా అటవీ ప్రాంత భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజన రైతులకు సాగుపట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని శుక్రవారం విజ్ఞప్తి చేశారు. గిరిజనుల హక్కుల చట్టం ప్రకారం వారికి సాగుపట్టాలు ఇచ్చే అవకాశం ఏమైనా ఉందా అని సంబంధిత మంత్రిని కోరారు. గిరిజనులకు ట్రాక్టర్లు, గొర్రెలు, మేకలు, ఆవులు, సరుకుల అంగళ్ళు తదితర వాటిని గిరిజనులకు ఇవ్వకుండా గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. గిరిజన కార్పొరేషన్ సైతం వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. మళ్లీ గిరిజన కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకవచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడం విద్యార్థులు, మహి ళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అందించే కాస్మోటిక్ చార్జీలు తల్లల ఖాతాల్లోకి కాకుండా విద్యార్థుల ఖాతాల్లోకి వేసేలా చర్యలు తీసుకోవాలని, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక టీచర్లను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

పేదలకే మఠం భూమి ఇవ్వాలి

మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సీపీఐ రామకృష్ణ వినతి



ధర్మవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బత్తలపల్లి సమీపంలోని సర్వేనెంబరు 401లోని 19.84 ఎకరాల మఠం భూమిలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న పేదలకే ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం విజయవాడలో వినతిపత్రం అందజేశారు. మండలంలో 22 గ్రామాల్లోని ఇళ్లు లేని పేదలు దాదాపు 1000 కుటుంబాలు ఆ స్థలంలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అనుచరులు ఈశ్వరెడ్డి, రామాంజినేయులు రూ.100 కోట్ల విలువైన ఆ భూమి నుంచి పేదలను వెళ్లగొట్టి.. కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, కావున ఆ స్థలాన్ని పేదలకు ఇళ్లపట్టాలుగా మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ధర్మవరం పట్టణంలోని కేశవనగర్‌లో సర్వేనెంబరు 338లో 1.15 ఎకరాల్లో 15 సంవత్సరాలుగా నివాసముంటున్న పేదలకు ఇంటిపట్టాలివ్వాలని కోరారు.

భవనం నుంచి పశువుల తరలింపు



భవనాన్ని పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

నంబులపూలకుంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బలిజపల్లిలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ .. ఆ భవన నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో ఆ భవనంలో స్థానికులు పశువులు, గొర్రెల మందలను ఉంచేవాళ్లు. ఈ విషయంపై పశువుల పాకగా సచివాలయం అనే పేరుతో ఆంధ్రజ్యోతి ఆదివారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఈఓఆర్డీ మాధవరెడ్డి శుక్రవారం ఆ భవనాన్ని పరిశీలించారు. అందులోని పశువులు, గొర్రెలు ఖాళీ చేయించారు.ఎవరైన ప్రభుత్వం భవనంలో ఇలాంటి పనులకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

బుక్కపట్నం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో గుంతమయమైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టే పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టామని టీడీపీ కన్వీనర్ చింతా మల్లిరెడ్డి తెలిపారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గుంతల రోడ్లల్లో ప్రయాణం చేస్తూ వాహనదారులు, ప్రయాణీకులు నరక యాతన అనుభవించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమ చేపట్టిందన్నారు. ఈకార్యక్రమంలో గంగాధర్, సతీష్‌రాయల్, జయరాం. హరి పాల్గొన్నారు.

కంప చెట్ల తొలగింపు

ధర్మవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ధర్మవరం చెరువు ప్రాంతంలోని శివాలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంప చెట్లను మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు ఎక్స్‌కవేటర్ సాయంతో శుక్రవారం తొలగించారు. కార్తీక మాసంలో ఈ శివాలయానికి భక్తులు ఎక్కువగా వస్తుండటం గమనించి.. వారికి ఎటువంటి ఆటంకం లేకుండా ఆ కంపచెట్లను తొలగించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నాయకులు హరీశ్‌బాబు, డోలారాజారెడ్డి పాల్గొన్నారు.


చెరువు వద్ద కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

అయ్యప్ప మాలధారులకు అన్నసంతర్పణ

కదిరి అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారులకు పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం నుంచి జనవరి 14 వరకు అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు అయ్యప్పసేవా సమితి సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 2.45 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిపస్తామని, అయ్యప్ప మాలధారులతు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

వన్యప్రాణుల అడుగుజాడలు సేకరించాలి



అవగాహన కల్పిస్తున్న డీఎఫ్ఓ చక్రపాణి

పెనుకొండ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ అటవీశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో 3కి.మీ తిరిగి అడవుల్లో సంచరిస్తున్న వన్యప్రాణుల అడుగుజాడలు సేకరించాలని సత్యసాయి జిల్లా అటవీశాఖ అధికారి డీఎఫ్ఓ చక్రపాణి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయంలో ఎంఎస్‌టీఆర్ఎల్ వీఈఎస్ అప్లికేషన్ వినియోగంపై అటవీశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1నుంచి అటవీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా డీఎఫ్ఓ, సబ్‌డీఎఫ్ఓ ఆనంద్, శ్రీశైలం బయోడైవర్సిటీ డీఎఫ్ఓ ధనరాజ్, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరెడ్డి, డీఆర్ఓ శివరాం హాజరయ్యారు.

అత్యాచారాల నివారణపై అవగాహన

పరిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరుగుతుండటంతో శుక్రవారం సీఐ రాఘవన్.. విద్యానిధి కళాశాల ఆవరణలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, సైబర్ నేరాలు, లైంగికదాడుల నుంచి తప్పించుకునేందుకు సమయస్ఫూర్తితో ఆలోచించి స్థానిక పోలీస్ స్టేషన్, లేదా 100కు సమాచారం అందిస్తే తక్కువ సమయంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలను రక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రంగడు యాదవ్, ఎఎస్ఐ జయలలిత, ప్రిన్సిపాల్ ఎల్లారెడ్డి, ఉపాధ్యాయ బృందం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టు రైతులు, రీలర్లను ముంచిన జగన్

రీలర్ల సంఘాల నాయకులు

హిందూపురం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇన్సెంటివ్ ఇవ్వకుండా పట్టు రైతులు, రీలర్లను గత వైసీపీ పాలనలో అప్పటి సీఎం జగన్ నిండా ముంచారని రీలర్ల సంఘం నేత ముస్తాఫా, రైతు సంఘం నాయకుడు సిద్దారెడ్డి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు శుక్రవారం మాట్లాడుతూ.. గతంలో మార్కెట్ ధరకు రూ.50 ఇన్సెంటివ్ ఇచ్చేవారన్నారు. 2019కి ముందు ప్రతిపక్ష నేతగా జగన్.. ఇన్సెంటివ్‌ను రూ.100కి పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టాక ఇన్సెంటివ్ పూర్తిగా నిలిపేసి, నిండా ముంచారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.60 కోట్లు ఇన్సెంటివ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. రీలర్లకు రూ.130 నుంచి రూ. 200 ఇన్సెంటివ్ ఇస్తామని ఆశచూపి, మోసం చేశారన్నారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు నవీన్, శ్రీనివాసులు, ఆదినారాయణ, రీలర్ల సంఘం నేతలు దాదాపీర్, బాషా, పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పరిగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి ఓబులు తనిఖీ చేశారు.

రైతు సమస్యలపై చర్చ హర్షణీయం

మడకశిర టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యంగా పట్టు రైతులకు జరుగుతున్న నష్టాలను ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షణీయం అని రైతు సంఘం అధ్యక్షులు వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం మడకశిర పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు ఓ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు.

సబ్‌జైలు తనిఖీ

పెనుకొండ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా లీగల్‌సెల్ అథారిటీ శివప్రసాద్ యాదవ్ శుక్రవారం పెనుకొండ సబ్‌జైలును తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖైదీలంతా బయటకు వెళ్లిన తరువాత సత్ప్రవర్తనతో మెలగాలన్నారు.

గోల్డ్‌లోన్ కంపెనీ ఉద్యోగి మోసంపై ఖాతాదారుల ఆందోళన

మడకశిరటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ గోల్డ్‌లోన్ కంపెనీలో పనిచేసే ఉద్యోగి కుచ్చుటోపీ పెట్టారని శుక్రవారం పలువురు ఖాతాదారులు.. సీఐ రాజ్‌కుమార్‌ను ఆశ్రయించారు. ఆ ఉద్యోగి ఖాతాదారులు తాకట్టుపెట్టే బంగారుపై వారికి తెలియకుండా వారు తీసుకున్న రుణం కన్నా ఎక్కువగా డబ్బు తీసుకొన్నాడని వారు సీఐకి తెలిపారు. దాదాపు 13 మంది వరకు బాధితులు తాము తీసుకొన్న గోల్డ్‌లోన్ తిరిగి చెల్లించడానికి వెళితే తాము తీసుకొన్న దానికన్నా ఎక్కువగా చూపుతున్నారన్నారు. అందులో పనిచేసే ఒక ఉద్యోగి తాము పెట్టే గోల్డ్‌తోనే అధికంగా లోన్ మంజూరు చేసుకొని స్వాహా చేసినట్లు ఆరోపించారు. దీనిపై సీఐ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇంతవరకు తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని, తమకున్న సమాచారం ప్రకారం 13 మంది తమ ఖాతాలకు సంబంధించి వారు తీసుకొన్న రుణం కన్నా అందులో పనిచేసే ఒక ఉద్యోగి అదనంగా తీసుకొని మోసం చేసినట్లు ఆరోపిస్తున్నారన్నారు. దీనిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారిస్తామని వారికి చెప్పినట్లు తెలిపారు.

18న భక్త కనకదాస జయంతి

పెనుకొండ టౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి) : ఈనెల 18న శ్రీభక్త కనకదాస 537వ జయంతి మహాసభ జరుగుతుందని, దానిని విజయవంతం చేద్దామని కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం అన్నా క్యాంటీన్‌లో కురుబ కులస్థుల సమావేశం ఏర్పాటుచేసి పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుబల ఐక్యత చాటుకోవడానికి అనంతపురం పట్టణంలో కేటీఆర్ ఫంక్షన్‌హాల్‌లో శ్రీ భక్త కనకదాస జయంతి సభను జరుపుతున్నామన్నారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పాల్గొంటారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెనుకొండ పట్టణంలో టౌన్‌ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం దర్గాపేట, ఎగువగడ్డ, కుమ్మరదొడ్డి, తోటగేరి, జీఐసీ కాలనీ, వజ్రాలపేట, క్రిష్ణదేవరాయల సర్కిల్, చెరువు రోడ్డులలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి తెలిపారు.

లెక్క తేలుస్తున్నారు



పురంలో సర్వే చేపడుతున్న సచివాలయ ఉద్యోగులు

- ప్రతి ఇంటికీ జియోట్యాగింగ్
- భవిష్యత్తులో ఎన్నో ఉపయోగాలు
- సర్వేలో సచివాలయ ఉద్యోగులు

హిందూపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల్లో ఎన్ని ఇళ్లు ఉన్నాయో అధికారులు లెక్కగడుతున్నారు. ప్రతి ఇంటినీ మ్యాపింగ్ చేసి, జియోట్యాగింగ్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తుండగా.. మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. గత వైసీపీ హయాంలో వీటిని చేపట్టారు. ప్రతి వలంటీర్‌కు 50 ఇళ్లు కేటాయించారు. అందుకు అనుగుణంగా ఈ ప్రక్రియ అప్పుడు సాగింది. మధ్యలో దీనిని నిలిపివేయడంతో అందుకు అనుగుణంగా ఈ ప్రక్రియను ప్రస్తుతం ప్రభుత్వం కొనసాగిస్తోంది. వలంటీర్‌వ్యవస్థ లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు సాంకేతికపరంగా వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వార్డు, గ్రామ, క్లస్టర్లవారీగా వివరాలను సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరి వేలిముద్ర కానీ, ఐరిష్‌కానీ అనుసంధానం చేస్తున్నారు.

ప్రతి ఇంటికీ మ్యాపింగ్

పట్టణంలోని ప్రతి ఇంటికీ ఉద్యోగులు వెళ్లి మ్యాపింగ్ చేస్తున్నారు. జియోట్యాగింగ్ అనుసంధానం చేస్తున్నారు. హిందూపురం పట్టణంలో 2011 లెక్కల ప్రకారం 42 వేల కుపైగా ఇళ్లు ఉన్నాయి. ఆ తరువాత నిర్మించుకున్న ఇళ్లను బట్టి సుమారు 55వేలదాకా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎంతో ఉపయోగకరం

జియోట్యాగింగ్ చేయడం వల్ల ఏ ఇంటికి ఏ పథకాలు అందాయన్న డేటా ప్రభుత్వం వద్ద ఉంటుంది. దీనిని బట్టి ఏ ఇంటికి ఏది అవసరమో ప్రభుత్వం నిర్ణయించుకుంటుంది. ఇది పథకాల మంజూరుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎవరైనా నేరాలకు పాల్పడినా వారికి సంబంధించిన సమాచారం కూడా ప్రభుత్వం వద్ద ఉంటుంది. వారికి సంబంధించి ఆధార్ నంబరు ఎంటర్ చేయగానే వారి ఇంటి లొకేషన్‌తోపాటు కుటుంబసభ్యుల వివరాలు కూడా తెలుసుకోవచ్చు.

ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి సర్వే భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ పథకాల మంజూరు, ఇతరత్రా నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుంది. హిందూపురం పట్టణంలో ఇప్పటి వరకు 30శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మున్సిపాలిటీలో కొంతమంది పన్నులు చెల్లించకుండా ఇళ్లు నిర్మించుకుని ఉంటారు. పల్లెల్లో కూడా పంచాయతీకి పన్ను చెల్లించకుండా ఉంటారు. అలాంటివారిని ప్రస్తుతం మున్సిపాలిటీ, పంచాయతీలు గుర్తించే వీలుంటుంది.



సీ కోడిగేపల్లిలో నెట్‌వర్కు లేక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ఇంటింటి సర్వేకు నెట్‌వర్క్ సమస్య

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొత్తగా చేపట్టిన ఇంటింటి సర్వే నెట్ వర్కు సమస్య కారణంగా ముందుకు సాగడం లేదు దీంతో సచివాలయ సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 110 గ్రామాలు ఉండగా, 18 సచివాలయాలు ఉన్నాయి. అందులో వివిధ శాఖలకు సబందించి 142 మంది సిబ్బంది పనిచేస్తున్నారు గత 10 రోజుల నుంచి గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటా సర్వేచేసి కుటుంబ సభ్యుల వివరాలు నమోదుచేస్తున్నారు. వారి వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నారు.. ముఖ్యంగా సరిహద్దు గ్రామాల్లో ఇంటింటి సరే చేసే సమయంలో సర్వర్ సనిచేయకపోవడంతో గంటల తరబడి ఇళ్ల దగ్గర వేచ్చి ఉండల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో ఇంటింటి సర్వే ఆలస్యంగా జరుగుతోంది.


కార్తీక దీపం.. సర్వపాప హరణం



పెనుకొండలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



హిందూపురంలో..




లేపాక్షి: ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి



కొత్తపాళ్యం వెంకటేశ్వరస్వామి



మడకశిరలో..



గుడిబండ మల్లేశ్వరస్వామి



లేపాక్షిలో..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పెనుకొండ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. లేపాక్షిలో దుర్గా వీరభద్ర, పాపనాశేశ్వర స్వాములను ప్రత్యేకంగా అలంకరించి జ్వాలతోరణం నిర్వహిం చారు. సోమందేపల్లిలో చౌడేశ్వరీ అమ్మవారు, షిర్డీసాయి బాబా, అయ్యప్పస్వామి ఆలయాల్లో సాయంత్రం సహస్ర దీపోత్సవం జరిగింది. హిందూపురం మోడల్ కాలనీలోని గంగమ్మ గుడి, శ్రీనివాస టాకీస్ వద్ద ఉన్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో లక్షదీపోత్సవాలు నిర్వహించారు. గుడ్డం రంగనాథస్వామి ఆలయం వద్ద 11 మార్లు గిరిప్రదక్షిణ చేపట్టారు. మడకశిర మండలంలోని భక్తరహళ్ళి నరసంహస్వామి, బిల్లేడగుంట ఆంజేయ స్వామి, నీలకంఠాపురంలోని నీలకంఠే శ్వస్వామి, గుడిబండ మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగళి శివాలయాలతో పాటు ఆంజనేయస్వామి దేవాలయాల్లో దీపోత్సవం జరిగింది.

పరిహారం కోసం కోసం ధర్నా



ధర్నా చేస్తున్న పాలసముద్రం భూనిర్వాసితులు

పెనుకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాసెన్, బెల్, భూనిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పరిహారం ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాలసముద్రం రైతులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. తాను గ్రామసభకు వెళ్తున్నానని అర్హుల జాబితా రైతులకు చూపాలని ఏఓ గిరికి చెప్పి వెళ్లారు. ఏఓ గిరి ఇచ్చిన జాబితాలో పాలసముద్రం గ్రామానికి చెందిన రైతుల పేర్లు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహానికి గురై ఏఓ ఛాంబర్‌ను చుట్టుముట్టి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ హైకోర్టు ఆదేశించిన మూడేళ్ల తరువాత కూడా అధికారులకు ఆర్అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుపట్ల అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏఓ, పోలీసులు, నిర్వాసితుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు ఏఓ జరిగిన విషయాన్ని ఫోన్‌ద్వారా ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్, కమిటీ సభ్యులు స్వర్ణలత, నారాయణ, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, భూనిర్వాసితులు గంగమ్మ, వెంకటలక్ష్మమ్మ, అచ్చమ్మ, రమేజమ్మ, కదిరప్ప, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 108 సేవా సిబ్బంది ధర్నా

పావగడ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల నుంచి 108 సిబ్బందికి జీతాలు ఇవ్వనందుకు నిరసనగా శనివారం రాత్రి నుంచి 108 సేవలు నిలిపివేసి ధర్నా చేపడుతున్నట్లు కర్ణాటక రాష్ట్ర ఆరోగ్య కవచ ఉపాధ్యక్షులు పరశురాం తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 715 అంబులెన్స్‌లకుగాను 3500 మంది సిబ్బంది పనిచేస్తున్నారని, రాత్రింబవళ్లు నిద్రాహారం లేకుండా ఉచిత సేవలు అందిస్తున్నప్పటికీ తమకు జీతాలు అందించకపోవడం దారుణం అని ఆయన తెలిపారు.